# వైభవంగా దసరా ఉత్సవాలు



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 22 అక్టోబరు, 2026 | పేజీలు :05

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**
**భూపాలపల్లిలో ఘనంగా పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం**
**అమరవీరులకు ఘన నివాళులు..**
**స్మృతి పరేడ్, రక్తదాన శిబిరం నిర్వహణ**

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** దేశ భద్రత, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు.అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, వారు చూపిన సేవా మార్గంలో నడుస్తూ ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరుకాగా, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ నేతృత్వంలో స్మృతి పరేడ్ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు గౌరవ వందనం సమర్పించి, పుష్పాంజలి ఘటిస్తూ ఘనంగా నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన 155 మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు ఎస్పీ నరేష్ కుమార్ చదివి వినిపించారు.









## అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలను ఎప్పటికీ మరువలేమన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది మరింత నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్‌ల పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమన్నారు. దేశం, సమాజం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

## ప్రజల భద్రత కోసం పోలీస్‌ల త్యాగాలు వెలకట్టలేనివి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, సమాజంలో శాంతిభద్రతల ను కాపాడేందుకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ వారిసేవలనుప్రతిఒక్కరూస్మరించుకోవాలనిపిలుపునిచ్చారు.

## అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ అండ

కార్యక్రమానికి హాజరైన పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెబుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## రక్తదాన శిబిరం ప్రారంభం

అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రారంభించారు. అమరవీరుల సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పోలీసులు ముందుండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, రెహమాన్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డిపిఒ సిబ్బంది, పోలీస్ సంఘం అధ్యక్షుడు నరేష్, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరులో అంబరాన్నంటిన దసరా సంబురాలు



వివరాలు మెయిన్‌లో...

# వనదుర్గమ్మ చెంత కిక్కిరిసిన భక్తజనం

**ప్రజాపక్షం/పాపన్నపేట:** వాగులు, వంకలు, కొండలు, కోణలు, దాటి వచ్చిన భక్త జనంతో మంగళవారం ఏడుపాయల వనం జనారణ్యమైంది. ఏడుపాయల్లో కొలువుతీరిన వనదుర్గమ్మను విజయదశమి రోజున భక్తులు దర్శించి తరించారు. ఎటు చూసినా జనమే జనంతో ఏడుపాయల క్షేత్రం హోరెత్తింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వనదుర్గమ్మను దర్శించుకునేందుకు, నూతన, పాత వాహనాలకు పూజలు నిర్వహించేందుకు భక్తులు వందలాదిగా తరలివచ్చారు. దీంతో పాటు తొమ్మిది రోజులుగా అట్టహాసంగా కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చివరి రోజైన మంగళవారం విజయదశమిని పురస్కరించుకొని వనదుర్గామాతను రాజరాజేశ్వరి దేవి రూపంలో పసుపు రంగు వస్త్రంతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## అట్టహాసంగా సాగిన దుర్గమ్మ నిమజ్జనం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన మంగళవారం విజయదశమిని పురస్కరించుకుని వనదుర్గమ్మ రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం వనదుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని గోకుల్ షెడ్ నుంచి పల్లకి సేవ నిర్వహించి ఏడుపాయల పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి ఏడుపాయల్లో ఒకటైన మంజీరా నదీ పాయలో నిమజ్జనం కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ గౌడ్, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## విజయానికి ప్రతీక విజయదశమి

ప్రజాపక్షం / వేలేరు : విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని వివిధ గ్రామాలలో గ్రామపాలకమండల్ల ఆధ్వర్యంలో జరిగిన దసరా వేడుకలు ఎస్సై దూదిమెట్ల నరేష్ పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో శాంతియుత వాతావరణంలో డీజె పాటలతో డ్యాన్సులు,సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు,ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ సంసృతి,సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈపండుగను కులమతలాకు అతీతంగా జరుపుకునే పండుగ అని కొనియాడుతూ దసరా పండుగ చెడుపై మంచి,అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజా పక్షం/రాయపర్తి : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో వరంగల్‌ఖమ్మం జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ములుగు జిల్లా కేంద్రానికి చెందిన కత్తి శివసాయిరామ్ (32) తన ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామంలోని అత్తవారింటికి వెళ్తుండగా వరంగల్ నుండి ఖమ్మం వైపుకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం దిక్కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. విజయదశమి పండుగ వేళ యువకుడి మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, సంవత్సరంన్నర కూతురు ఉన్నట్లు సమాచారం. మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట మార్చురికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.

## దుర్గామాతకు టిపిసిసి సభ్యుడు రంజిత్ రెడ్డి ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం / నెక్కొండ: నెక్కొండ పట్టణంలోని బొడ్రాయి ఆంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో దుర్గాభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, బెజ్జంకి వెంకటేశ్వర్లు, గంధం రాజు, ఇతర నాయకులు, మహిళా భక్తులు, అమ్మవారి మాలధారులు పాల్గొన్నారు.

# హనుమకొండలో ఘనంగా రావణవధ



ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ పట్టణంలోని పద్మాక్షి గుట్ట వద్ద విజయదశమి సందర్భంగా రావణ వధ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు. దీంతో హనుమకొండ బస్టాండు, పద్మాక్షి గుట్ట ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. ఈ రావణ వధ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు,మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పోరేటర్‌లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ కార్పోరేటర్‌లు,ఉత్సవ సమితి అధ్యక్షులు రావుల సుదర్శన్,ఉపాధ్యక్షులు కసుకుంట్ల రవికుమార్,పులి రజినీకాంత్,చీకటి ప్రకాష్,కార్యదర్శి సొంబరాజు రాజ్ కుమార్,తోట పవన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రావణ వధ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామని, హనుమకొండలో గత మూడు దశాబ్దాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కమిటి సభ్యులను ఆయన అభినందించారు.

# ఓరుగల్లు వైభవానికి అద్దం పట్టిన నవరాత్రి ఉత్సవాలు



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : ఓరుగల్లు నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు, సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలు, రావణ వధ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగియడం పట్ల సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉత్సవాలకు వేలాది సంఖ్యలో భక్తులు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చినప్పటికీ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించిన నగర పోలీస్ కమిషనర్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది, ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసుల సేవలు అభినందనీయమని నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, వైద్య సేవలు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచిన విద్యుత్ శాఖ, మున్సిపల్ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, అగ్నిమాపక శాఖ, పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి నిమ్మల శ్రీనివాస్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో హాజరై పోలీసు, ట్రాఫిక్ సిబ్బందికి,అధికారులకు పూర్తి సహకారం అందించిన ఓరుగల్లు ప్రజలకు, భక్తులకు, మహిళలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఓరుగల్లు సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి వైభవాన్ని రాష్ట్రవ్యాప్తంగా చాటి చెప్పడంలో మీడియా మిత్రుల కృషి ఎంతో అభినందనీయమని అన్నారు. పండుగల సందర్భంగా ప్రజల భద్రత, సౌకర్యాల కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్క అధికారి, ఉద్యోగి, పోలీసు సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లు, నిర్వాహకులు, ప్రజలు మరియు మీడియా మిత్రులకు మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు.

# బుచ్చంపేటలో వైభవంగా కబడ్డీ పోటీలు

ఎఫ్ఎస్‌సిఎస్ డైరెక్టర్
చిట్టి మల్ల రజిత సమ్మయ్య



ప్రజాపక్షం/మంగపేట : దసరా పండుగను పురస్కరించుకొని మండలం లోని బుచ్చంపేట గ్రామంలో క్రీడా వేడుకలు అంబరాన్నంటాయి. జై కిసాన్ యువ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఉత్సాహపూరిత వాతావరణంలో కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించారు. విజయదశమి పండుగ రోజున ఊరి ప్రజలంతా ఒకే చోట చేరి, ఎంతో సంతోషంగా ఈ క్రీడోత్సవాన్ని తిలకించి ఆటగాళ్ల ప్రతిభని ప్రోత్సహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విజేత జట్లకు బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు సామ మల్లారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ చిట్టిమల్ల రజిత సమ్మయ్య లు నగదు బహుమతులను అందజేసి ప్రశంసించారు. అలాగే, టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ చూపిన బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్‌లకు పల్లె రమేష్, నాగుల సతీష్ లు ప్రత్యేక నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పండుగ పూట గ్రామీణ క్రీడలైన కబడ్డీ పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి, సోదరభావం పెరుగుతాయని కొనియాడారు. క్రీడలు మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ యువ రైతు సంఘం నాయకులు కాటూరి నాగయ్య, పగిడిపల్లి జయరాజు, పల్లె శోభన్ బాబు, మండల రమేష్ కాటూరి మల్లూర్, బల్లెం మాణిక్యం, దార ధర్మయ్య, దార సమ్మయ్య, వీలిషాల సమ్మయ్య, మద్దెల ఎల్లయ్య, పగిడిపల్లి మణిబాబు పాల్గొన్నారు.

# ఆయుధాలకు పూజలు..

ప్రజలపై ప్రయోగించే పరిస్థితి
రావొద్దని ప్రార్థన!



ప్రజాపక్షం/ నెక్కొండ: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఫనీధర్, ఎస్సై శ్రావణ్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బంది ఆయుధాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆయుధ పూజ మన సంప్రదాయానికి ప్రతీకగా నిర్వహిస్తూ, ప్రజల రక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తించే పోలీసుల చేతుల్లోని ఆయుధాలను ఏనాడూ ప్రజలపై ప్రయోగించాల్సిన పరిస్థితులు రాకూడదని భగవంతుడిని ప్రార్థించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవి, కానిస్టేబుల్ మహమ్మద్ అక్బర్, హెడ్ కానిస్టేబుల్లు పరుశరాములు, నాగేశ్వరరావు, సరిత, తిరుపతి, హోంగార్డులు తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ భవనం పక్కన గల ఖాళీ స్థలంలో నూతన భవన నిర్మాణానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్ లు శంకుస్థాపన చేశారు.మంగళవారం ఉదయం 8 గంటలకు పురోహితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమం జరిగింది. క్లబ్ ఆదాయం పెంపు లక్ష్యంగా మా కమిటీ నూతన భవన నిర్మాణానికి ఏకగ్రీవంగా తీర్మానించింది, అందులో భాగంగా ఈ రోజు శంకుస్థాపన చేశామని, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా దీవించాలని భగవంతున్ని ప్రార్థించారు.కార్యక్రమంలో కమిటీ బాధ్యులు యంసాని శ్రీనివాస్, వలిశెట్టి సుధాకర్, పాడిచెట్టి విష్ణువర్ధన్, వీరగోని హరీష్, జనగాని అంజనేయులు, ఎండీ నయీంపాషా, కందుకూరి సంజీవ్, టీయూడబ్ల్యూజే హన్మకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం కేశవమూర్తి, ఉట్కూరు సాయిరాం, నేతలు వల్లాల వెంకటరమణ, రామాచారి, శోభన్ బాబు, తదితరులు హాజరయ్యారు

# పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ

ప్రజాపక్షం/లింగాలఘణపురం : విజయదశమి పండుగ పురస్కరించుకొని మండల కేంద్రం లోని స్థానిక పోలీస్ స్టేషన్ లో మంగళవారం నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కిషోర్ స్టేషన్ ఆవరణలో జమ్మి చెట్టుకు పూజ చేసి, అనంతరం ఆయుధాలకు వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలగకుండా, బందోబస్తు నిర్వహించి, దసరా పండుగను సజావుగా జరిగే బాధ్యతలు వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంతులు ఫారనంది కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శ



ప్రజాపక్షం/బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్ల బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు దాసరి కరుణాకర్ రెడ్డి కుటుంబాన్ని బుధవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించారు. కరుణాకర్ రెడ్డి సోదరుడు కమలాకర్ రెడ్డి ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం ప్రకటించారు. అనంతరం గ్రామంలో దుర్గామాత పండపాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు గంగం సతీష్ రెడ్డి, నాయకులు ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, పందిపెల్లి సిద్దిరాంరెడ్డి, పర్వతం మధుప్రసాద్ పడిగెల కరుణాకర్ రెడ్డి, పేరబోయిన పరుశరాములు, చింతల కరుణాకర్, పోచంపల్లి రజిత, మధు, బొమ్మ నర్సింహులు, గంధమల్ల మహేష్, బొమ్మెన ఆంజనేయులు గౌడ్, రమేష్, అల్వాల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం

ప్రజాపక్షం/మంగపేట : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ములుగు జిల్లా మంగపేట మండలంలోని పలు గ్రామాలలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల వద్ద బుధవారం ఉదయం ఆయా ఆలయాలలోని, మండపాలలోని అమ్మవారి విగ్రహాల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని పలు ఆలయాలలో, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గా మాత విగ్రహాలను బుధవారం ఆయా గ్రామాలలో ఊరేగించి అనంతరం పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. మండలంలో దుర్గ మాత విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా మంగపేట ఎస్ఐ టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

# గూడూరు మండలంలో అంబరాన్నంటిన దసరా సంబరాలు

**ప్రజాపక్షం/గూడూరు;**చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి వేడుకలు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల వ్యాప్తంగా అత్యంత వైభవంగా ఆధ్యాత్మిక శోభతో జరిగాయి. మండల పరిధిలో ని మొత్తం 40 గ్రామపంచాయతీల్లో దసరా పండుగను ప్ర జలు భక్తిశ్రద్ధలు సంప్రదాయ ఉత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజ లు వాహన పూజలు నిర్వహించగా సాయంత్రం వేళల్లో జ మ్మి పూజలతో పల్లెలన్నీ పండుగ వాతావరణంతో కళకళ లాడాయి. మండలంలోని పలు గ్రామాల్లో అనాదిగా వస్తున్న సంప్రదాయాల ప్రకారం వేడుకలు కొనసాగాయి.గ్రా మాల్లో గ్రామ దేవతలకు ముందుగా సోరకాయను సమర్పించి ఆపై మేకపోతుల బలులు ఇచ్చి తమ మొక్కులు చె ల్లించుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి చీడపీడలు లేకుండా పంటలు సమృద్ధిగా పండి పాగిపంటలతో సభిక్షంగా ఉం డాలని ప్రజలు అమ్మవారిని వేడుకున్నారు. మరికొన్ని ము ఖ్యగ్రా మాల్లో సాయంత్రం వేల విజయదశమి సందర్భంగా రావణసుర వధ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భారీ ఎత్తున ఏర్పాటు చేసిన రావణాసురడి ప్రతిమను బా ణాసంచా వెలుగుల నడుమ దహనం చేశారు. బాణాసంచా పేలుళ్ల జయజయధ్వానాలతో గ్రామాల సర్పంచ్‌లు స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఊరేగింపుగా వెళ్లి జమ్మిచెట్టు వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పవిత్రమైన పాలపిట్టను దర్శించుకుని శుభాలు కలగాలని ఆకాంక్షించారు.ప్రజాప్రతినిధులు పర్యవేక్షణ మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా సర్పంచ్‌లు ఉపసర్పంచ్‌లు వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శులు వేడుకలను దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామాల మధ్య ఐక్యత సోదరభావం వెల్లివిరిసేలా పండుగ వాతావకణాన్ని విజమవంతం చేసిన గ్రామ ప్రజల కు సహకరించిన ప్రతి ఒక్కరికీ స్థానిక సర్పంచ్‌లు కృతజ్ఞత లు తెలిపారు.ఈ వేడుకల్లో యువకులు మహిళలు చిన్నారు లు నూతన వస్త్రాలు ధరించి ఉత్సాహంగా పాల్గొనడంతో పల్లెసీమల్లో పండుగ కోలాహలం సృష్టంగా కనిపించింది.

## భక్తిశ్రద్ధలతో దుర్గామాత శోభాయాత్ర



**ప్రజాపక్షం/ నెక్కొండ :** నెక్కొండ బొడ్రాయి వద్ద శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం శోభాయాత్రను సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన దుర్గామాత ఉత్సవ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బెజ్జంకి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మెరబోయిన రమేష్ యాదవ్ , సోమ సత్తిరెడ్డి, లైశెట్టి వినయ్, వల్లా రఘోత్తం రెడ్డి, బెజ్జంకి శ్రీనివాస్, మల్లేష్, పొట్లపల్లి సురేష్, పోలోజు భరత్, ఎడ్ల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ నగర్ కాలనీలో దసరా వేడుకలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ: హనుమకొండ నగరంలోని విద్యుత్ నగర్ కాలనీలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు నల్ల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి విజయదశమి వేడుకలను ప్రారంభించారు. విజయదశమి పండుగ ప్రాధాన్యతను ప్రతిబింబించేలా కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.

## మహేష్‌కు ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు నివాళి

### పున్నేలు గ్రామానికి చెందిన మహేష్ మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం



**ప్రజాపక్షం/ఐనవోలు :** వర్ధన్నపేట నియోజకవర్గం లోని ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి చెందిన గుడికందుల మహేష్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరంగల్ మార్చురీ వద్ద మహేష్ భౌతికకాయాన్ని హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కెఆర్ దిలీప్ రాజ్ తో కలిసి సందర్శించిన ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు గారు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధిత కుటుంబానికి ఈ కష్ట సమయంలో మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. మహేష్ మృతి పున్నేలు గ్రామం లో విషాదాన్ని నింపిందని, మృతుడి కుటుంబానికి ఈ లోటు తీరనిదని పేర్కొన్నారు. మహేష్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు గారు ప్రార్థించారు. వారి వెంట జిల్లా జెబిఎం చైర్మెన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు రాజయ్య, వార్డు మెంబర్లు చెన్నూరి రవి, చిన్ని, నాయకులు రాయపురం సాంబయ్య, గ్రామ నాయకులు, పాల్గొన్నారు.

## వరంగల్‌లో డిసెంబర్ 21న రామ నరసయ్య సంస్మరణ సభ




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సిపిఐ ఎంఎల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పొట్ల రామ నరసయ్య 50 వర్ధంతి సభలను రాష్ట్ర వ్యాప్తంగా జరపాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ ఆవునూరి మధు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కామ్రేడ్ రామ నరసయ్య 1975 సంవత్సరంలో నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయంలో నరహంతక వెంగళరావు ప్రభుత్వం కామ్రేడ్ రామ నరసయ్యను అక్టోబర్ 30వ తేదీన అరెస్టు చేసి నవంబర్ మూడవ తేదీన బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపిందని అన్నారు. నాటి ఎమర్జెన్సీ కాలంలో వందలాదిమంది విప్లవకారులను వెంగళరావు ప్రభుత్వము హత్య చేసిందన్నారు. నాటి ఎమర్జెన్సీ పరిస్థితిని తలపించే విధంగా నేడు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అమలుపరుస్తూ ప్రజల ప్రజాస్వామిక హక్కులను హరించి వేస్తున్నదని ఆఖరికి ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభంగా చెప్పే ప్రజల ఓటు హక్కును కూడా కాలరాచి వేస్తున్నదని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకొనుటకు విప్లవకారులే గాక మేధావులు విద్యార్థులు ప్రజాస్వామికవాదులు అందరు కలిసి జరగబోయే ఉద్యమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సెక్రటేరియట్ సభ్యులు కెగోవర్ధన్, మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, నాయకులు బండి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాతకు వెండికిరీటం బహూకరణ



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని ఆలీంపూర్ గ్రామ దుర్గామాతకు గ్రామానికి చెందిన చెన్నూరి బాలమణి ఉప్పలయ్య దంపతులు అరకిలో వెండి కిరీటాన్ని బహూకరించారు. దసరా పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి కిరీటం బహూకరించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి తన మొక్కు చెల్లించుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాకాల నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ నరెడ్ల బాల్ రెడ్డి, గూడ రవీందర్ రెడ్డి, ఉప్పలయ్య, జనార్ధన్ రెడ్డి, గ్రామస్తులు దండ్యాల కరుణాకర్ రెడ్డి, ఆలయ పూజారి కుంట గోవర్ధన్, బాలమణి, ఉప్పలయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నవగ్రహాల ఆలయానికి విరాళం అందజేత



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని ఆలీంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన నవగ్రహాల ఆలయానికి గాను గ్రామానికి చెందిన పాకాల శ్రీనివాస్ రూ. 21వేల విరాళం అందించారు. బుధవారం గ్రామంలో ఆయన ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కోరిన మేరకు తనవంతుగా ప్రకటించిన మొత్తాన్ని కోశాధికారి అరిగే సంపత్‌కు అందించడం జరిగింది. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సభ్యులు శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవి ఎల్లారెడ్డి, దాసారం శ్రీనివాస్, పాకాల బాలకృష్ణ, పాకాల కనకయ్య, పాకాల రాజేశ్వర్, తదితరులున్నారు.

## బీరప్పగడ్డలో దుర్గమ్మ నిమజ్జనం



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** పట్టణంలోని బీరప్పగడ్డలో మహారాణి దుర్గామాయ ఆధ్వర్యంలో దుర్గమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 50 మందితో చేపట్టిన శోభాయాత్ర నాసిక్ డోలు దరువులతో ఉత్సాహంగా సాగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, మంగళహారతులు నిర్వహించి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. దుర్గమ్మ ఆశీస్సులతో జనగామ ప్రజలందరు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మహారాణి దుర్గామాయ కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన మాతంగి రాజేష్ (33) మంగళవారం మల్లికుదుర్ల గ్రామశివారులోని కమాన్ సమీపంలోని చెరువు వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో గాయపడగా స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది పైలెట్ రహీముద్దీన్,టెక్నీషియన్ లింగమూర్తి ఘటనా స్థలికి చేరుకొని బాధితుడికి ప్రథమ చికిత్స అందిస్తూ మెరుగైన వైద్యం కోసం ఎంజిఎంకు తరలించారు.ఈసందర్భంగా బాధితుడు తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై దూదిమెట్ల నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**తమ్ముడిపై అన్న సుత్తితో దాడి కేసు నమోదు**

కుటుంబంలో పాత గొడవలతో పాటు దసరా పండుగ సందర్భంగా జరిగిన వివాదాలను మనసులో పెట్టుకొని తనపై,తన భార్యపై,తన చిన్న కుమారుడిపైన,పెద్ద కుమారుడు ఆంగోతు రాజు సుత్తితో దాడి చేశాడని ఆరోపిస్తూ చింతలతండ గ్రామానికి చెందిన ఆంగోతు మోతీరామ్(60)తన పెద్దకుమారుడు ఆంగోతు రాజుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ ఐ దూదిమెట్ల నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# తీగలవేణిలో తీవ్ర విషాదం

### పండుగ వేళ రేషన్ డీలర్ మహంకాళి వెంకటయ్య కన్నుమూత

### పండుగ వేడుకలను రద్దు చేసుకున్న గ్రామస్థులు* సర్పంచ్



**ప్రజాపక్షం/గూడూరు;**విజయదశమి పర్వదినాన సంబరాల్లో మునిగిపోవాల్సిన తీగలవేణి గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. పండుగ పూట గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త ప్రజా అభిమాని మహంకాళి వెంకటయ్య (రేషన్ డీలర్) అకాల మరణం చెందడంతో గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం దసరా పండుగను ఘనంగా జరుపుకోవడానికి ఊరంతా అన్ని ఏర్పాటు చేసుకుంది. మరికొద్ది సేపట్లో జమ్మి పూజ అలయ్ బలయ్ వేడుకలు ప్రారంభం కావాల్సిన ఉండగా సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో వెంకటయ్య హఠాన్మరణం చెందారన్న వార్త దావానలంలా వ్యాపించింది. దీంతో ఒక్కసారిగా పండుగ సందడి ఆగిపోయి.ఊరంతా నిశ్శబ్దం ఆవరించింది. మహంకాళి వెంకటయ్య కేవలం రేషన్ డిలర్‌గానే కాకుండా ఎల్ఐసీ ఏజెంట్‌గా గ్రామీణ డాక్ సేవక్(బిపిఎం)గా ప్రజలకు ఎన్నో ఏళ్లుగా నిస్వార్థ సేవలందించారని సర్పంచ్ దారావత్ రాజు నాయక్ తెలిపారు. గ్రామ ప్రజల కష్టసుఖాల్లో ముందుంటూ ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మెలిగేవారు నిరుపేదల సరుకుల పంపిణీలో ఎన్నడూ ఇబ్బంది కలగకుండా చూసేవారని ఎల్ ఐసి పాలసీల ద్వారా ఎన్నో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారని గ్రామస్థుల గుర్తుచేసుకున్నారు. ఊరికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి పండుగ రోజే అనంతలోకాలకు వెళ్లిపోవడంతో గ్రామస్థుల ఎవరూ దసరా వేడుకలు జరుపుకోలేదు పిండివంటలు పూజల సందడి స్థానంలో వెంకటయ్య నివాసం వద్ద రోదనలు మిన్నంటాయి. ఆయన మృతి గ్రామానికి తీరని లోటని పలువురు గ్రామ పెద్దలు యువకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రేగోడులో వైభవంగా దుర్గమ్మ దేవి శోభయాత్ర



**ప్రజాపక్షం/రేగోడు:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగించుకొని దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర రేగోడు తో పాటు ఆయా గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు బుధవారం రేగోడు దుర్గమ్మ దేవి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవి శోభయాత్ర కన్నుల పండుగ నిర్వహించారు శోభ యాత్రలో పిల్లలు మహిళలు ఆట పాటలు తో ఆడుతూ ప్రధాన వీధులలో శోభ యాత్ర నిర్వహించారు ఈ శోభయాత్రలో ఆయా పార్టీల మండల నాయకులు అధికారులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు పాల్గొన్నారు

## శివ్వంపేటలో జమ్మిపూజలో రణరంగం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రమైన శివ్వంపేటలో దసరా పండగ జమ్మిపూజలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మంగళవారం జరిగిన దసరా సందర్భంగా సాయంత్రం జమ్మిపూజ జరుగుతుండగా శివ్వంపేటలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఉండగా అధికార కాంగ్రెస్ నాయకులు జమ్మిపూజను ఎలా నిర్వహిస్తారని బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు పార్టీల నాయకులు మాట మాట పెరిగి ఒకరినొకరు తోసుకొని ఘర్షణ చేసుకున్నారు. దీంతో వెంటనే తూప్రాన్ సీఐ వెంకటరాజా గౌడ్, ఎస్ఐ మధుకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బలగాలను మోహరించి ఇరువర్గాలను లాఠీలతో చెదరగొట్టారు. అనంతరం పోలీసు పహారా మధ్య దసరా వేడుకలు జరిగాయి.

## బైక్‌ను ఢీకొన్న కారు ఒకరు మృతి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం బచ్చన్నపేట మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన శేఖర్ తన స్నేహితుడు రాజశేఖర్‌తో కలిసి బైక్ కొండపోచమ్మ వైపు వస్తున్న క్రమంలో అతి వేగంతో ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీ కొట్టడంతో బైక్ నడుపుతున్న శేఖర్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, రాజశేఖర్ తీవ్రగాయాలైనట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అసువులు బాసిన ప్రసాద్, రఘునందన్, నర్సింలు, అంబెద్ హుస్సేన్, రాంచందర్‌ల చిత్రపటాలకు అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణకే తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రజల భద్రతే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగాలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘనంగా అశ్రునివాళులర్పించారు. ఈ కార్యక్రమం ఏఎస్ఐ తుక్కయ్య, దేవిదాస్, జమేధర్ అంజయ్య, మల్లేశం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పద్మా దేవేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బి.ఆర్.ఎస్ నేతలు



**ప్రజాపక్షం/ మెదక్ :** దసరా పండుగను పురస్కరించుకొని మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ని మెదక్ బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొంపల్లిలోని పద్మా దేవేందర్ రెడ్డి గారి నివాసానికి వెళ్లిన మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్, వారిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఆత్మీయ కలయికలో నాయకులు పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆప్యాయంగా ముచ్చటించుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యత, స్నేహభావం, పరస్పర సహకారం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్ తో పాటు యువ న్యాయవాది జీవన్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, మైనంపల్లి రంగన్న, కసాపురం కిరణ్, శ్రీకాంత్ సాగర్, చేదల అరుణ్, ఆంజనేయులు, మల్లేశం తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి దసరా శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** దసరా పండుగను పురస్కరించుకుని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి నివాసానికి వెళ్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపిన మనోహరాబాద్ మండల్ బిఆర్ఎస్ నాయకులు ఈ సందర్భంగా బుధవారం దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారాయణ గౌడ్, శివ్వంపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, పోతారం మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, మెదక్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పంచమి రేణు కుమార్, సర్పంచ్ మోతీబాయి లక్ష్మణ్ సింగ్, మాజీ ఉప సర్పంచ్ వీరేష్‌తో పాటు పలువురు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కళ్ళకల్‌లో ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు



**ప్రజాపక్షం/ మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండలం కళ్ళకల్ గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ శ్రీ వనదుర్గ కాలకంటి బంగారమ్మ ఆలయంలో 24వ వార్షిక శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి ఘనమైన ఊరేగింపుతో పాటు నిమజ్జన కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా కనులపండువగా నిర్వహించారు. అమ్మవారికి సమర్పించి పూజలు అందుకున్న పరమ పవిత్రమైన చీరను రమా ఆగ్రో టెక్ మేనేజింగ్ డైరెక్టర్ యేషాం అనిల్ యాదవ్ రూ. 30,000/ లకు దక్కించుకున్నారు. అమ్మవారి చీరను సొంతం చేసుకోవడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే, అమ్మవారికి లక్ష్మీదేవి అలంకరణ చేసిన సందర్భంలో పూజలు అందుకున్న ప్రత్యేక మాలను కళ్ళకల్ గ్రామానికి చెందిన 3వ వార్డు సభ్యురాలు, నవీన ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ నిర్వాహకులు నేతికుంట నవీన సత్యనారాయణ రూ. 52,000/ లకు కైవసం చేసుకున్నారు. ఆయన ఈ మాలను వరుసగా నాలుగోసారి దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. ఊరేగింపు మరియు నిమజ్జన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వేణుగోపాల శర్మ, గురు మాతలు, గ్రామ సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్, ఉప సర్పంచ్ వీర బోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, పాలకవర్గ సభ్యులు, పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు, పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.

## రేగోడులో ఘనంగా దసరా రావణ దహనం

**ప్రజా పక్షం/రేగోడు:** దసరా పర్వదిన వేడుకలు మంగళవారం రేగోడు తో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా ఘనంగా నిర్వహించారు రేగోడు లో సాంప్రదాయంగా ఆయుధాలతో వెళ్లి జమ్మి చెట్టు వద్ద పండితులు ఆయుధ పూజలు నిర్వహించి దసరా వేడుకలు జరుపుకున్నారు రేగోడు హనుమాన్ సమాజ్ సేవ యువకులు మొదటిసారిగా రేగోడు పాఠశాల గ్రౌండ్ లో రావణ దహనాన్ని నిర్వహించారు. రావణ దహన కార్యక్రమానికి రేగోడు తో పాటు ఆయా గ్రామాల ప్రజలు మహిళలు పిల్లలు పెద్దలు భారీగా పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో అమ్మవారికి వీడ్కోలు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండల కేంద్రంలో శీలం కోట అల్లాదుర్గంలో, గడి పెద్దాపూర్, ముసలాపూర్, మాందాపూర్, రెడ్డిపల్లి గ్రామాలలో ఏర్పాటుచేసిన దేవి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు.అమ్మవారి నిమజ్జనాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని డప్పు చప్పుళ్లు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య అమ్మవారి శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. మహిళలు, యువకులు భక్తి పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సంబరాల్లో పాల్గొన్నారు.అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు అమ్మవారిని మొక్కుకున్నారు.నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగియడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. భక్తుల రాకతో నిమజ్జన ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

## ఘనంగా దసరా ఉత్సవాలు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండలంలోనీ ఆయా గ్రామాలలో మంగళవారం విజయదశమి పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకుని ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగను పురస్కరించుకుని పలు గ్రామాలలో సాయంత్రం భాజా భజంత్రీలతో శోభ యాత్రగ వెళ్లి జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి దసరా పండగను ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. దసరా పండుగ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయాలు సందడిగా మారాయి.

## దుర్గామాతకు పద్మాదేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పాపన్నపేట మండలం కొడపాక గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల నిమజ్జనం సందర్భంగా బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి యూత్ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామస్థులు పద్మాదేవేందర్‌రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపి ఆప్యాయంగా పలకరించారు. వారితో ఆమె కొద్ది సేపు ముచ్చటించారు.ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ..దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కొడపాక గ్రామ సర్పంచి కాశీనాథ్‌రావు, పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జగన్, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచులు సంగప్ప, సంజీవరెడ్డి, బద్రి, మల్లేశం, శ్రీనాథ్‌రావు, నాయకులు బాలరాజు, శంకర్‌గుప్తా, దత్తు, చారి, దుర్గయ్య, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశం సెట్, మల్లేశం, సాయివర్ధన్‌గౌడ్, దేవి యూత్ సభ్యులు నాగభూషణం, చారి, చన్‌బసప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో అంబరాన్నంటిన దసరా సంబరాలు

**ప్రజాపక్షం / మెదక్ :** మెదక్ జిల్లా వ్యాప్తంగా విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. మంగళవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడగా, శమీ, వాహన పూజలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శమీ పత్రాలను పెద్దలకు అందించి ఆశీస్సులు పొందిన ప్రజలు స్నేహితులు, కుటుంబ సభ్యులకు వాటిని పంచుతూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు ప్రాంతాల్లో మహిషాసుర, రావణ దహన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పిండివంటలు, ఆత్మీయ పలకరింపులతో పల్లె, పట్టణాల్లో పండుగ సందడి నెలకొంది.

**మెదక్ జిల్లా కేంద్రంలో జనసందోహం...**



మెదక్ జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కళాశాల మైదానం మంగళవారం రాత్రి ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్ రావు, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులతో కలిసి రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఉత్సాహం నింపాలని ఆకాక్షించారు. వచ్చే ఏడాది వరకు నియోజకవర్గంలో మరింత అభివృద్ధి పనులు జరుగుతాయని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని సూచించారు. వేడుకలకు కుటుంబ సమేతంగా తరలివచ్చిన వేలాది మంది సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు, బాణసంచా వెలుగులను ఆస్వాదించారు. మేళతాళాల నడుమ నిర్వహించిన వేడుకలు ఉత్సాహాన్ని నింపాయి. రావణ దహనాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో మైదానంలో పండుగ సందడి నెలకొంది.

## మంచిరామిలో ఘనంగా శమీ పూజలు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మండలంలోని మంచిరామి గ్రామంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జమ్మి శమీ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి ఆధ్వర్యంలో జమ్మి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఒకరికొకరు జమ్మి ఆకులను అందజేసుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని జమ్మి పూజను ఘనంగా నిర్వహించారు.

## గంగమ్మ ఒడిలో దుర్గమ్మ

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలం లోని మండలం వ్యాప్తంగా దుర్గామాత నిమజ్జన ఉత్సవం ఆయా గ్రామాల ప్రజలు కన్నుల పండుగగా చేసుకున్నారు.తొమ్మిది రోజులపాటు దసరా శరవన్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అభిషేకాలతో అర్చనలతో మహిళలు ఆరాతులతో రథం పట్టారు. ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చనలు హోమాలు అన్నదానాలు నిర్వహించారు. ఆఖరి రోజున మహిళలు శోభ యాత్రలో పాల్గొని కోలాటాలు నృత్యాలు చేశారు.అనంతరం మొక్కులు చెల్లించుకుని పాడిపంటలు బాగా పండాలని దుర్గాదేవిని ప్రార్థించారు.

## కంటి వైద్య పరీక్షల మొబైల్ వ్యాన్ ప్రారంభం

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల పట్టణంలో ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించే మొబైల్ వ్యాన్‌ను బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మంగళవారం ప్రారంభించారు. రాందేశ్ సేవా సమితి సహకారంతో న్యూ పవన్ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కంటి వైద్య ఉచిత పరీక్షల సంచాల మొబైల్ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మారుమూల ప్రాంతంలోని ప్రజలకు సైతం కంటి వైద్య సేవలు అందుబాటులో తీసుకురావడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, డాక్టర్ బద్రినారాయణ, నాయకులు నాగరాజు, పట్టి వెంకటకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేసిఆర్ కు దసరా శుభాకాంక్షలు తెలిపిన వంటేరు

**ప్రజాపక్షం/గజ్వేల్ :** దసరా పండుగ పర్వదిన సందర్భంగా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో గులాబి అధిపతి కెసిఆర్ ను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ బాధ్యులు చైర్మన్, గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.



## మాజీ మంత్రి హరీష్‌ను కలిసిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు

**ప్రజాపక్షం/గజ్వేల్ :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పార్టీ నేతలు రమేష్ గౌడ్, ప్రభాకర్, మద్ది రాజిరెడ్డి, హైమద్ తదితరులు మాజీ మంత్రి హరీష్ రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతాపరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నేతలు



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకొని మనోహరాబాద్ మండలానికి చెందిన పాలట గ్రామ సర్పంచ్ నీలం సాయికుమార్ గౌడ్.బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులతో కలిసి బుధవారం గజ్వేల్‌లోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి వంటేరు ప్రతాపరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలం సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులంతా కలిసి వంటేరు ప్రతాపరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, ఘనంగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వేళ నియోజకవర్గం లోని రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి కార్యక్రమాలపై కొద్దిసేపు సౌహార్ద వాతావరణంలో చర్చించుకున్నారు. నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా పండుగ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మనోహరాబాద్ మండల అధ్యక్షుడు శేఖర్ గౌడ్‌తో పాటు పలు గ్రామాల మాజీ సర్పంచులు,వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లిఖార్జున స్వామి ఆలయంలో జమ్మి చెట్టుకు పూజలు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** దసర పర్వదినం సందర్భంగా సదాశివపేట భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే చింతప్రభాకర్ జమ్మి చెట్టుకు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్మి చెట్టుకు ప్రత్యేక నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. విజయ దశమి పర్వదినం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ,ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసర పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు,విజయాలు, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింతగోపాల్ శంకర్; అశోక్ గౌడ్, గంటా శివయ్య, జనార్దన్, వృథ్వీరాజ్ ,దయానంద్,బస్వరాజ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో అంగరంగ వైభవంగా దసరా వేడుకలు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆద్వర్యంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన శ్రీ మహంకాళీ సేవా సమితి ఆద్వర్యంలో మైత్రి క్రీడా మైదానంలో నిర్వహించిన మహిషాసుర దహన కార్యక్రమంలో మాద్రి వృథ్వీరాజ్ పాల్గొన్నారు. పటాన్చెరు జిహెచ్ఎంసి కార్యాలయం బుద్ద విగ్రహం వద్ద ధ్వజపతాకావిష్కరణ ,కొత్త మార్కెట్ వద్ద శమీ పూజ నిర్వహించారు. ఈ వేడుకల్లో పటాన్ చెరు పట్టణ ప్రముఖులు ,పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మైత్రి క్రీడా మైదానం జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా పటాన్‌చెరు పెద్దలు, తరతరాలుగా కొనసాగిస్తున్న ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భవిష్యత్ తరాలు ,కూడా పాటించేలా ముందుకు తీసుకెళ్తామని మన సంస్కృతి సంప్రదాయాలను బావితరాలకు వారసత్వంగా అందిస్తామని మాద్రి వృథ్వీరాజ్ తెలిపారు.



## బోథ్‌లో మృతదేహాల ఫ్రీజర్ సదుపాయం

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ పట్టణ ప్రజలకు అత్యవసర సమయంలో ఉపయోగపడేలా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మృతదేహాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్‌ను అందుబాటులోకితీసుకువచ్చారు. ఈ సందర్భంగా విడిసి చైర్మన్ అల్లకొండ పోతన్న మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి,వారికి ఉపయోగపడే సేవలను అందించాలనే ఉద్దేశంతో ఫ్రీజర్ సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కుటుంబ సభ్యులు,బంధువులు ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పుడు ఇంట్లో ఎవరైనా మృతి చెందితే, వారు బోథ్‌కు చేరుకునే వరకు మృతదేహాన్ని భద్రపరచడం ఇబ్బందిగా మారుతోందని పోతన్న పేర్కొన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఫ్రీజర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విడిసి చైర్మెన్ పోతన్న, ఉపాధ్యక్షులు యాసిన్, కోశాధికారి రాయిపెల్లి రమాకాంత్, రాజు, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## నిమజ్జనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని పురాణబజార్, భవానీ చౌక్ వద్ద నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన హారతి కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.ప్రజలందరూ శాంతియుతంగా ఉత్సవాల్లో పాల్గొని అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గంగమ్మ ఒడికి అమ్మవారి విగ్రహాలు

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలో దుర్గామాత నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని గడ్డన్న వాగు ప్రాజెక్టు వద్ద భారీ క్రేన్ల సహాయంతో అమ్మవారి విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చుతున్నారు.నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా జిల్లా ఎస్‌పి డా. జి. జానకి షర్మిల పర్యవేక్షణలో భైంసా ఎఎస్‌పి సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణంలోని కీలక ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. పోలీసు నియంత్రణ గది నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ నిమజ్జనోత్సవాలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు.

## ఘనంగా దసరా వేడుకలు

**ప్రజాపక్షం/మావల:** ఆదిలాబాద్ పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ఎంపి గోడం నగేష్, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగానేతలు, అధికారులు మాట్లాడుతూ విజయదశమి పం డుగ ధర్మానికి, విజయానికి ప్రతీక అని, ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలలో ఉత్తమంగా నిలిచిన వినాయక మంటపాల నిరాహకులకు ప్రజాప్రతినిధులు, అధికారులు జ్ఞాపికలను అందజేసి అభినందించారు.

## నృసింహుడిని దర్శించుకున్న సినీ నిర్మాత దిల్ రాజు

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు బుధవారం జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. దిల్ రాజు తొలుత ప్రదానాలయం శ్రీ యోగనంద లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం అన్ని అనుబంధ ఆలయాలలోని స్వామివారల దర్శనం చేసుకున్నారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు, అర్చకులు దైవ ఆశీస్సులు అందించారు. దేవస్థానం పక్షాన సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాన్ని అందించి దిల్ రాజు ను సన్మానించారు. వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు నంబి నరసింహమూర్తి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎస్.దినేష్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.